ప్రశాంతంగా 'పది' పరీక్షలు

పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద శుక్రవారం ఉదయం నుంచే సందడి నెలకొంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహించారు. సమయానికి గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు ఆల్ ద బెస్ట్ చెప్పి లోనికి పంపించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను చెక్‌చేసి హాల్‌లోకి అనుమతించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు, తహసీల్దార్‌లు, పోలీసు అధికారులు పర్యవేక్షించారు.


మిరుదొడ్డి(దుబ్బాక): పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థినులు


మర్కూక్(గజ్వేల్): హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న టీచర్


హుస్నాబాద్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

రేపటితో మల్లన్న బ్రహ్మోత్సవాలు ముగింపు


స్వామివారి మూల విరాట్టు

కొమురవెల్లి(సిద్దిపేట): పది వారాలపాటు కొనసాగిన మలన్న బ్రహోత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. ముగింపు వారానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

అంబులెన్స్‌లోనే ప్రసవం


మగబిడ్డను చూపుతున్న సిబ్బంది

సిద్దిపేటరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన గర్భిణీ అంబులెన్స్‌లోనే ప్రసవించింది. గ్రామానికి చెందిన పల్లపు శృతికి శుక్రవారం అకస్మాత్తుగా ప్రసవ నొప్పులు వచ్చాయి. దీంతో అంబులెన్స్‌లో తీసుకువెళ్తుండగా మార్గ మధ్యంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. టెక్నీషియన్ నరేందర్, పైలెట్ వెంకటేశం సమయస్ఫూర్తిగా వ్యవహరించారు.

50 శాతం సబ్సిడీపై యంత్రాలు


శ్రీనివాస్, ఏడీఏ

హుస్నాబాద్‌రూరల్: మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని ఏడీఏ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. డివిజన్‌కు రూ.26 లక్షల సబ్సిడీ పరికరాలు వచ్చాయని, పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న మహిళలు అర్హులన్నారు. ట్రాక్టర్, డ్రోన్, గడ్డి కట్టలు కట్టే మిషన్, రోటొవేటర్, కల్టివేటర్, బ్రష్‌కట్టర్, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, స్ప్రేయర్లు లాంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెరువు విషయంలో గొడవలొద్దు: సీఐ లతీఫ్


రైతులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐలు

దుబ్బాకటౌన్: ఎల్లమ్మ చెరువు ద్వారా వచ్చే సాగునీటిని ముంగిసపల్లి, లింగారెడ్డిపల్లి రైతులకు సమానంగా ఇచ్చి న్యాయం చేస్తామని సీఐ లతీఫ్ చెప్పారు. ఎల్లమ్మ చెరువు నీటి విషయంలో ఇటీవల ఆ రెండు గ్రామాల రైతుల మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందవద్దని, సమానంగా నీరు అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు.

దీక్షలో పాల్గొనడం అదృష్టం


వడ్లను అందజేస్తున్న రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: గోటి తలంబ్రాల దీక్షలో పాల్గొనడం తమ అదృష్టమని సీఐ సైదా అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో రామరాజు పోలీసు సిబ్బందికి గోటి తలంబ్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే తలంబ్రాలను సిద్ధంచేసే కార్యక్రమంలో తమను భాగస్వాములను చేయడం సంతోషంగా ఉందన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న శివయ్య తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం జనగామలో దాదాపు రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ శివయ్య, వైస్ చైర్మన్ ఎగ్గిడి ఎల్లయ్య భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ డైరెక్టర్ సందర్శన

ములుగు(గజ్వేల్): స్థానిక పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని సమగ్ర శిక్షా రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకుడు పి.రాజీవ్ శుక్రవారం సందర్శించారు. గదుల్లో ఏర్పాట్లను పరిశీలించారు. వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యువత అభిప్రాయాలు కీలకం

- ప్రిన్సిపాల్ సునీత
- ముగిసిన యూత్ పార్లమెంట్ ఫెస్టివల్

సిద్దిపేటఎడ్యుకేషన్: దేశ విధాన నిర్ణయానికి సంబంధించి చేపట్టే ఇలాంటి కార్యక్రమాలలో యువత తెలియజేసిన అభిప్రాయాలు ఎంతో కీలకం అన్నారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ నోడల్ జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో మేడ్చల్, సిద్దిపేట, జనగామ జిల్లాల నుంచి సుమారు 100 మంది యువతి, యువకులు పాల్గొన్నారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే అంశంపై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలపై యువత ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ అధ్యాపకులు పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థుల్లో పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే..



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

యువతకు ప్రోత్సాహం



ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ చాలా ముఖ్యం. దేశవ్యాప్తంగా ఒకే సారి పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నికలను నిర్వహిస్తే ఎలా ఉంటుంది అనే అశంపై యువత అభిప్రాయాలను తీసుకోవడం గొప్ప విషయం. ఇలాంటి కార్యక్రమాల వల్ల ఎన్నికల నిర్వహణపై అవగాహన పెరుగుతుంది.

– తాటోజు గాయత్రి, ఎంఏ, పాలిటిక్స్

గ్రామీణ విద్యార్థుల గొంతుక



ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంత విద్యార్థుల గొంతుక అని చెప్పవచ్చు. వన్ నేషన్, వన్ ఎలక్షన్‌తో సమయం, ఖర్చు రెండూ మిగులుతాయి. దేశ భద్రత, ఎన్నికల వ్యవస్థ, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై సామాన్య విద్యార్థుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం శుభసూచకం.

– బి.వివేక్ వర్ధన్, ఎంఏ, పాలిటిక్స్

నమ్మకాన్ని పెంచింది



ఒకే దేశం, ఒకే ఎన్నికపై యువత అభిప్రాయాలు తెలుసుకోవడం ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని పెంచుతుంది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో యువత అభిప్రాయ సేకరణ చేయడం ఒక గొప్ప విషయం.

– శ్రీవైష్ణవి, బీటెక్, ద్వితీయ

ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

కలెక్టరు మనుచౌదరి

కొండపాక(గజ్వేల్): చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా స్వీకరించినప్పుడు మంచి ఫలితాలను సాధిస్తారని కలెక్టరు మనుచౌదరి అన్నారు. స్థానిక ఆనంద నిలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేశారు. అలాగే బాలసదనంలోని విద్యార్థుల గురించి అడిగి తెలుసుకొన్నారు. రాజీవ్ రహదారి నుంచి ఆనంద నిలయం వరకు రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని కలెక్టరును సభ్యులు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వార్తాపత్రికలను చదవాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందేలా సొంతంగా కంప్యూటర్‌ను అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఆనంద నిలయం ట్రస్టు నిర్వాహకులు పెద్ది వైకుంఠం, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టరు మనుచౌదరి

సాగునీరు విడుదల చేయాలని వినతి

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులకు సాగునీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా కాపాడాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులకు సాగునీరు విడుదల చేయకపోవడం వల్ల మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లోని వరిపంట ఎండిపోయిందన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నుంచి మల్లన్న సాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్లకు నీటిని ఎత్తి పోసేందుకు అవసరపడే రూ.6 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో పంపింగ్ ప్రక్రియ సజావుగా సాగడం లేదని వాపోయారు. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ కాలువల పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, దుర్గయ్య, కుమార్, శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

అడవుల పెంపకం అందరి బాధ్యత

విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రఘువీర్

గజ్వేల్‌రూరల్: అడవుల పెంపకం మనందరి బాధ్యత అని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి రఘువీర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నాయన్నారు. ప్రిన్సిపాల్ అనిత అబ్రహం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ లక్ష్మి అడవుల సంరక్షణపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కమలా క్రిస్టియాన, శ్రీలత, జయరాజు, ఉమారాణి, బాలచంద్రం పాల్గొన్నారు.

మేగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన

కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 70 మంది ఎంపికైనట్లు తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి శోభారాణి పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న రఘువీర్

31లోగా పేమెంట్ పూర్తిచేయండి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా 31లోగా మున్సిపల్, పంచాయతీ పరిధిలో పెండింగ్ దరఖాస్తులకు సంబంధించిన పేమెంట్‌లను పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన గూగుల్ మీట్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 31 తర్వాత కడితే రిబేటు వర్తించదన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీదేవి, మున్సిపల్ కమిషనర్లు, డీటీసీపీఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీ

గజ్వేల్‌రూరల్: జిల్లాలోని పలు ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుబ్బాకలో 2, నంగునూరు సీహెచ్‌సీలో 1, గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో 1, చేర్యాల సీహెచ్‌సీలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 26లోగా తమ దరఖాస్తులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో అందజేయాలని కోరారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

సిద్దిపేటజోన్: హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్ స్వచ్ఛంద సంస్థ ప్రతియేటా అందించే రంజాన్ తోఫా(నిత్యావసర వస్తువులు)లను శుక్రవారం పోలీస్ బందోబస్తు మధ్య పేద ముస్లింలకు పంపిణీ చేశారు. తంజిమ్ సంస్థ కోరిక మేరకు ప్రతియేటా ఎమ్మెల్యే హరీశ్‌రావు పంపిణీ చేస్తుంటారు. అయితే ఈ సారి కాంగ్రెస్ నాయకులు ముందుకు రావడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. మదిన ఫంక్షన్ హాల్ వద్ద అధిక సంఖ్యలో ముస్లింలు శుక్రవారం బారులు తీరారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి పంపిణీ చేశారు.

కాంగ్రెస్ రాజకీయం

గత పదేళ్లుగా ఎమ్మెల్యే హరీశ్‌రావు తన మిత్రుల సహకారంతో రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నారని, ఈసారి కాంగ్రెస్ రాజకీయం చేసిందని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు మోహిజ్, అతీక్ ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాజకీయం చేసి పోలీసుల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం సరికాదన్నారు.


బందోబస్తు మధ్య రంజాన్ తోఫా పంపిణీ

చైతన్యంతోనే అక్రమ రవాణాకు అడ్డుకట్ట

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహిళల చైతన్యంతోనే మనుషుల అక్రమ రవాణా, లైంగిక వేధింపులను అడ్డుకోవచ్చని ఎస్.చంద్రమోహన్, ఎంపీడీఓ రాంరెడ్డి అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళలకు శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వీఓఏ తొలగింపు సరికాదు..

మండలంలోని చిన్నకిష్టాపూర్ వీఓఏ మంగను విధుల నుంచి తొలగించడం సరికాదని వీఓఏ సంఘం మండలాధ్యక్షుడు కనకయ్య, సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యాయం జరిగే వరకు ఆమెకు అండగా ఉంటామని చెప్పారు.


వీఓఏలతో మాట్లాడుతున్న చంద్రమోహన్

నీటి దిశ, రాష్ట్ర దశను మార్చింది కేసీఆరే..

రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గోదావరి నీటి దశను మార్చి రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరిచ్చి, సంక్షేమ పథకాలతో రాష్ట్ర దశను మార్చిన ఘనత అపర భగీరథుడు కేసీఆర్‌కే దక్కుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్ అన్నారు. 'గోదావరి కన్నీటి గోస' పేరుతో గోదావరి ఖని, నుంచి కొండపోచమ్మసాగర్ వరకు నిర్వహిస్తున్న పాదయాత్ర శుక్రవారం సిద్దిపేటకు చేరుకుంది. అనంతరం సిద్దిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, తాగునీటికి గోస పెడుతున్న ప్రజల సమస్యలు తెలిపేందుకే పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు.


పాదయాత్రగా వెళ్తున్న చందర్ తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ మంత్రిపై కబ్జా ఆరోపణలు సరికాదు

హుస్నాబాద్: ఎల్లమ్మ దేవాలయం భూమికి సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సయ్యద్ రఫీ చేసిన భూ కబ్జా ఆరోపణలు సరికాదని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. దేవాలయ ఆవరణలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 265లో ఉన్న 4.04 ఎకరాల ఎల్లమ్మ ఆలయ భూమిలో రోడ్లు ఉన్నాయని, గుడికి ఉత్తరాన మార్కెండేయ గుడి ఉందన్నారు. సయ్యద్ తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని చెప్పారు. సమావేశంలో లక్ష్మీనారాయణ, వీరన్న యాదవ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నరేశ్‌గౌడ్, సదిగౌడ్ ఉన్నారు.

◆ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హుస్నాబాద్: బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి రఘువీర్ తెలిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురేశ్, కార్యదర్శిగా ఒగ్గోజు సదానందం, సహాయ కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా శ్రీనివాస్, లైబ్రరీ సెక్రటరీ శ్రీనివాస్ నాయక్, స్పోర్ట్స్ అండ్ లైబ్రరీ సెక్రటరీభాస్కర్ ఎంపికైనట్లు తెలిపారు.

◆ ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలి

దుబ్బాక: ఆర్టీసీని ప్రైవేట్ పరంచేసే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని నిరుపేదల హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్ మూర్తి ఆగిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, డీఏ లాంటి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ మద్దతు ఉంటుందన్నారు.

◆ కనీస వేతనం కోసం వినతి

దుబ్బాక: జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్ఎచ్ఎం) పథకాన్ని రెగ్యులరైజ్ చేసి ఆశా వర్కర్‌లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల డిమాండ్ చేశారు. తిమ్మాపూర్, రామక్కపేట పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు శుక్రవారం వారు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో శ్యామల, భారతమ్మ, అనిత, చంద్రకళ, లత, శారద, బాబాయి, సంతోష, శోభ, నాగరాణి తదితరులు ఉన్నారు.

◆ కవిత్వానిది కీలక పాత్ర

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమాజం అభివృద్ధి, మార్పు కోసం కీలక పాత్ర పోషించేది కవిత్వమేనని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐత చంద్రయ్య అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న సమస్యలపై కవితా రచన సాగించాలన్నారు. కార్యక్రమంలో రాజమౌళి, రాజేశం, లక్ష్మయ్య, రాజ్‌కుమార్, పరశురాములు, రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ యూనియన్ బ్యాంక్‌లో తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): యూనియన్ బ్యాంక్ ఆర్ఓ వికాస్, ఎల్‌డీఎం హరిబాబు శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంక్‌లో విచారణ జరిపారు. బ్యాంక్‌లో బాధితుల ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురించిన 'పీఎం విశ్వకర్మ లబ్ధిదారుల ఇక్కట్లు' అనే కథనానికి బ్యాంకు అధికారులు స్పందించారు. దరఖాస్తు దారుల రుణాల గురించి మేనేజర్ రోషన్ అగర్వాల్‌తో మాట్లాడారు. బ్యాంక్ వద్దకు చేరకున్న దరఖాస్తుదారులు, బీసీ సంఘం, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజేశంగౌడ్, మధు, దామోదర్ సమస్యలను వివరించారు.

◆ బాల్య వివాహాలు చేయొద్దు

చేర్యాల(సిద్దిపేట): తెలిసీ తెలియని వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేయవద్దని, 18 యేళ్లు నిండని పిల్లలతో పనులు చేయించ వద్దని సీఐ ఎల్.శ్రీను చెప్పారు. స్థానిక స్త్రీ నిధి కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్‌నేరాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


కనులపండువగా స్వామి అమ్మవార్ల ఊరేగింపు

కల్యాణం కమనీయం

వర్గల్(గజ్వేల్): కల్యాణ శోభతో నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం అలరారింది. శుక్రవారం రాత్రి శ్రీనృసింహస్వామి, లక్ష్మీ అమ్మవారు ఒక్కటయ్యారు. అర్చక, వేద పండితులు, రుత్విక్కుల వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని భక్తజనులు తిలకించి తరించారు. కల్యాణానికి మేము సైతం అన్నట్లు కురిసిన వర్షపు జల్లులు క్షేత్రాన్ని తడిపేశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన కల్యాణోత్సవం అర్ధరాత్రి ఒంటి గంట వరకు కొనసాగింది. ఆలయ ఈఓ విశ్వనాథశర్మ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.


నాచగిరిలో శ్రీలక్ష్మీనారసింహుల కల్యాణోత్సవ ఘట్టం